పశు బీమా.. పాడి రైతుకు ధీమా


పాడి ఆవుకు బీమా సందర్భంగా చెవిపోగు వేస్తున్న సచివాలయ పశువైద్య సహాయకురాలు


బీమాపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏడీ పద్మావతి

- ఒకసారి బీమా ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల కాలపరిమితి
- 21 రోజుల్లోపే పరిహారం చెల్లింపు
- ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఐరాల: మండలంలో గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమకే అధిక ప్రాధాన్యమిస్తారు. అయితే పశుపోషణ సవాళ్లతో కూడుకుంటుంది. ఈ నేపథ్యంలో జీవాల పెంపకందారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాడి పరిశ్రమలో పశువులు, గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు వీటినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. పలు రకాల వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదవశాత్తు, సహజ సిద్ధంగా మృతి చెందిన వాటికి బీమా చెల్లించేందుకు ప్రభుత్వం కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది.

పశుబీమా పథకం ఇలా..

పశుబీమా పథకంలో ఆవులు, గేదెలతో పాటు ఎద్దులు, గొర్రెలు, మేకలతో పాటు పందులకు బీమా చేయించవచ్చు. గతంలో ఎద్దులు, పందులు ఈ బీమా పథకంలో లేవు. ఒక కుటుంబంలో 5 పశువులకు 50 జీవాల వరకు పశుబీమా చేసుకునేందుకు అవకాశం ఉంది. ఉత్పాదక దశలో ఆవులకు 2 నుంచి 10 ఏళ్ల వయస్సు ఉండాలి. ఒక ఈతలోనైనా పాలిచ్చినవై ఉండాలి. గేదెలకు 3 నుంచి 12 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. మేలు జాతి ఎద్దులు, దున్నపోతులు పనిచేసేవిగా ఉండాలి. విదేశీ జాతికి ఏడాదిన్నర నుంచి పదేళ్లు, దేశీయ జాతివైతే రెండేళ్ల నుంచి పదేళ్ల వయస్సు ఉండాలి. గొర్రెలు, మేకలు, పందులకు 6 నెలలు వయసు ఉండాలి.

పశు బీమా ప్రీమియం చెల్లింపు ఇలా..

రేషన్ కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.30 వేలు విలువ చేసే పశువుకు మూడేళ్ల కాలవ్యవధికి రూ.384 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పెద్ద రైతులైతే రూ.900 ప్రీమియం చెల్లించాలి. పశువులకు రూ.30 వేలకు పైబడి ఉంటే 6.4 శాతం అధికంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇక గొర్రెలు, మేకలు, పందులకు ఏడాదికి, రెండేళ్లకు, మూడేళ్లకు బీమా చేయించుకోవడానికి అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి రైతు ఒక గొర్రె, మేక లేదా పందికి ఏడాదికి రూ.36 ప్రీమియం చెల్లించాలి. రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.76 ప్రీమియం చెల్లించాలి. పెద్ద రైతు కుటుంబాల వారైతే ఏడాదికి ఒక గొర్రెకు గానీ, మేకకుగాని రూ.90 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. రెండేళ్లకు అయితే రూ.135, మూడేళ్లకు అయితే రూ.187.50 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

జీవాలు మరణిస్తే..

పశువులు, జీవాలు ఏదైనా కారణంతో మరణిస్తే వెంటనే పశువైద్య శాఖ అధికారులకు తెలియజేయాలి. రైతు ముందుగా చెల్లించిన కాలపరిమితిని, చెల్లించిన బీమా ప్రీమియం పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లిస్తారు. ఆరు నెలల, ఆపైబడిన వయసు కలిగిన జీవాలు (ఒక కుటుంబానికి 50 మాత్రమే) మరణిస్తే రూ.6 వేలు పరిహారం చెల్లిస్తారు. దేశవాళీ పశువులకు రూ.30 వేలు, నాటు పశువులకు రూ.15 వేలు బీమా (ఒక కుటుంబానికి 5 పశువులకు) ప్రభుత్వం చెల్లిస్తుంది. పశువు మరణించిన 21 రోజుల్లో బీమా మొత్తం రైతు బ్యాంకు ఖాతాలో జమవుతుంది.

పాటించాల్సిన నిబంధనలు

పశువులకు బీమా చేయించే సమయంలో బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతోపాటు (దారిద్ర్య రేఖకు దిగువ ఉన్నవారు) ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు బియ్యం కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకువెళ్లాలి. పశువు, గొర్రె, మేక, పంది మరణించిన వెంటనే దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలోని పశువైద్య సహాయకులకు లేదా పశువైద్యాధికారికి లేదా 1962కు ఫోన్ చేసి తెలియజేయాలి. పశువుకు, గొర్రెకు, మేకకు, పందికి తప్పనిసరిగా చెవిపోగు వేయించాలి. చెవిపోగు లేనిచో బీమా సొమ్ము రాదు అనే విషయాన్ని మరవరాదు. ఒక వేళ చెవిపోగు పడిపోతే వెంటనే దగ్గరలోని ఆర్బీకేలో గానీ, పశువైద్యశాలలో తెలియజేసి, కొత్త చెవిపోగు వేయించుకొని నమోదు చేయించుకోవాలి. ప్రమాదవశాత్తు పశువులు మరణించినప్పుడు ఎఫ్ఐఆర్ ఖచ్చితంగా తీసుకోవాలి. బీమా చేయించిన పశువును అమ్మిన వెంటనే (7 రోజుల లోపే) బీమా కంపెనీ వారికి తెలియజేసి, బీమా పాలసీని కొనుగోలుదారుని పేరుపై నమోదు చేయించుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం



వైఎస్సార్ పశుబీమా పథకం పాడి రైతులకు మేలు చేకూరుతుంది. పశువులు, జీవాలు మరణించిన 21 రోజుల్లోనే బీమా మొత్తం రైతు బ్యాంకు ఖాతాకు జమవుతుంది. బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పశువులు, జీవాలు మరణిస్తే బాధిత రైతు గ్రామ సచివాలయంలో ఉన్న వెటర్నరీ సహాయకులు, పశువైద్యశాల డాక్టర్‌కు తెలియజేయాలి.

\- పద్మావతి, ఏడీ, పశుసంవర్ధకశాఖ, ఐరాల

బీమా చెల్లించాను



మాకు మేకలు, గొర్రెల మంద ఉంది. బీమా చెల్లించాలని పశువుల డాక్టర్‌తో పాటు గ్రామ సచివాలయం వెటర్నరీ సిబ్బంది, గోపాల మిత్రలు చెప్పారు. మేకలు, గొర్రెల మందకు బీమా చెల్లించాను. మా లాంటి వారి కోసం ప్రభుత్వం, అధికారులు ఆలోచన చేయటం గొప్ప విషయం. ఇలాంటి పథకం ఉందని ఇప్పటివరకూ మాకు తెలియదు.

\- మునిక్రిష్ణ, గొర్రెల కాపరి, వీ.ఎస్.అగ్రహారం, ఐరాల

క్లుప్తంగా

పేదలకు ఇంటి పట్టాలు అందజేత


ఇంటిపట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక 194 బండపల్లెలో డీకేటీ భూములను రైతులు జగనన్న కాలనీలకు ఇచ్చారు. అందుకుగాను వారికి స్థానికంగా లే అవుట్‌లో 20 మందికి నివాస స్థలాల పట్టాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో నాయకుడు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా కిషోర్‌కుమార్‌రెడ్డి



బంగారుపాళెం: చిత్తూరు వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడుగా మండలానికి చెందిన కిషోర్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, పార్టీని మరింత బలోపేతం చేసి, జగనన్న చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళతానని చెప్పారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్పందన ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీ రూపంలో తహసీల్దార్‌కి అందజేయవచ్చని కోరారు.

మహిళలకు క్రీడా పోటీలు

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠ శాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా సందర్భంగా మహిళలకు వాలీబాల్, క్రికెట్, పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గౌరీ ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించి క్రీడాపోటీలకు క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వరసిద్ధుని సేవలో జెడ్పీ వైస్ చైర్మన్


జెడ్పీ వైస్ చైర్మన్‌కు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన కాణిపాకం విచ్చేయగా ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేకదర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్ర పటం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, చిత్తూరు జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

నగలపై రాయితీ ఆరంభం


ప్రారంభోత్సవంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జోయాలూకస్‌లో ఆదివారం మజూరీ చార్జీలపై 50 శాతం తగ్గింపు ఆఫర్‌ను ప్రారంభించారు. ఈ బ్రోచర్‌ను జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. గోల్డ్, డైమండ్, సిల్వర్ అమ్మకాలపై ఈ రాయితీ ఫిబ్రవరి 18వ తేదీ వరకు ఆఫర్ ఉంటుందని మేనేజర్ షనీష్ తెలిపారు.

విజేతలకు బహుమతులు

బైరెడ్డిపల్లె: కళాతరంగిణి సంగీత, నృత్య శిక్షణా కేంద్రంలో ఆదివారం చిన్నారులకు నిర్వహించిన పాటల పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. భక్తి, జానపద, సినిమా పాటల విభాగాల్లో ఎంపికైన చిన్నారులకు విశ్రాంత సెరికల్చర్ అధికారి మునిరత్నం, విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. వారు మాట్లాడుతూ చిన్నారుల్లో దాగివున్న కళాప్రతిభను వెలికితీసేందుకు కళాతరంగిణి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

కబడ్డీ విజేత గంగాధరనెల్లూరు


ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో తలపడుతున్న క్రీడాకారులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గంగాధరనెల్లూరు మండలం జట్టు విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం లైన్‌బాయ్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొన్నాయి. గంగాధరనెల్లూరు మండలం లక్ష్మిరెడ్డిపల్లె జట్టు ప్రథమ స్థానం, బంగారుపాళెం మండలం ముంగర మడుగు జట్టు ద్వితీయ స్థానం, నల్లంగాడుకోటూరు జట్టు మూడోస్థానం, తగ్గువారిపల్లె జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు రూ.2000, 1000, 500, 250 నగదు బహుమతులను అందజేశారు. గ్రామీణ క్రీడైన కబడ్డీని ప్రోత్సహించే ఉద్దేశంతో పోటీలను నిర్వహించినట్లు దావుద్, బబ్లూ తెలిపారు.


గంగాధరనెల్లూరు జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

మెకానిక్‌లకు అండగా ఉంటాం


మెకానిక్‌లకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: మెకానిక్‌లకు అండగా ఉంటామని వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయ కర్త విజయానందరెడ్డి తెలిపారు. నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం చిత్తూరు టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చి మాట్లాడారు. సంఘం లోగోను సహాయ కార్మికశాఖాధికారి జగదీష్‌బాబు, ట్రాఫిక్ సీఐ నిత్యబాబుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మెకానిక్‌లకు సంఘం పరంగా గుర్తింపు కార్డులను అందజేశారు. చిత్తూరులోని ప్రతి ఒక మెకానిక్‌కు తన వంతుగా 2 జతల యూనిఫాంను అందజేస్తామని హామీనిచ్చారు. ఇంతకు ముందు చిత్తూరులో బైక్ మెకానిక్‌లు చాల తక్కువ మంది ఉండేవారన్నారు. అప్పట్లో బైక్‌రేస్‌లు పెట్టేవారిని ఆ సమయంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మరణించడంతో రేస్‌లను ఆపివేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రతి కుటుంబానికి 4 బైక్‌ల వరకు ఉండటంతో వాటిని మరమ్మతులు చేసే వారి సంఖ్య పెరిగిందన్నారు. చిత్తూరులో తొలిసారి యూనియన్ పెట్టారని, అందరూ సభ్యతగా ఉండాలని సూచించారు. అందరూ కలిసి హెల్త్ ఇన్సూరెన్స్‌లు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ-శ్రమ్ కార్డులను పొందాలని సహాయ కార్మికశాఖాధికారి జగదీష్‌బాబు తెలిపారు. దీంతో ప్రమాద బీమా ఇతర సంక్షేమం అందుతుందన్నారు. సంబంధిత వివరాలకు కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో నిందితులను మెకానిక్ మురగ సాయంతో గుర్తించామని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. ప్రతి ఒక వాహనాదారుడు లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. చివరిగా అతిథులకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి మురగేష్, ఉపాధ్యక్షుడు మున్నా, నాయకులు దేవేంద్ర, షణ్ముగరెడ్డి, మస్తాన్, యువరాజ్, సంపత్, కృష్ణామూర్తి, కోఆప్షన్ సభ్యులు ఆను, చందు, వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు త్యాగ, నాయకులు కేపీ శ్రీధర్, మాపాక్షి మోహన్, కుమారస్వామిరెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌ను ప్రోత్సహించాలి

చిత్తూరు రూరల్: వ్యవసాయ రంగంలో సోలార్ సిస్టం (సౌర విధానం) ద్వారా విద్యుత్‌ను రైతులకు ప్రభుత్వం అందించేలా ప్రోత్సాహం అందించాలని రైతు సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సంఘ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ వాడకం రాష్ట్రంలో మరింతగా పెరుగుతోందన్నారు. వ్యవసాయ రంగంలో విద్యుత్ తప్పనిసరి కావడంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడిని పెంచుకోవడానికి ప్రభుత్వం వ్యవసాయ రంగంలో సోలార్ సిస్టంను తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తద్వారా విద్యుత్‌కు చెల్లించే ఖర్చు తగ్గించడంతోపాటు రైతులకు గిట్టుబాటు ధర కల్పించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం సోలార్ సిస్టంపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు జయచంద్ర, భూపతి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీజైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్‌వి అరవింద్ ఆస్పత్రి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించగా 186 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 86 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి ఉచితంగా ఆపరేషన్, వసతులు కల్పిస్తామని నిర్వాహకులు సుభాష్‌జైన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ చంద్, విశాల్ జైన్, సాగర్ జైన్, ప్రవీణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు దిగువ మొదలపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని దిగువ మొదలపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. స్థానిక ప్రజలు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐకమత్యంతో సంఘాన్ని బలపరుద్దాం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘనాయకులు, సభ్యులు

చిత్తూరు రూరల్: ఐకమత్యంతో ఈడిగ సంఘాన్ని బలపరుచుకుందామని ఈడిగ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. చిత్తూరు నగరం కట్టమంచి శివాలయ ఆవరణలో ఆదివారం సంఘ సమావేశం, మహోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఈడిగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, వినోద్‌కుమార్ సభ్యులతో కలిసి ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అందరికీ క్యాలెండర్ పంపిణీ చేసి, ప్రసంగించారు. అగ్రవర్ణాలకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్న ఈడిగ, కులస్తులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాధికారం కోసం ఈడిగ కులస్తులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సంఘం బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈడి కులధ్రువీకరణ పత్రం మంజూరు విషయంలో సంఘం పెద్దలు పూర్వపరాలను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు దీనదయాల్ గౌడ్, తారక్ గౌడ్, రాజేష్‌గౌడ్, గురుస్వామి గౌడ్, గోపిగౌడ్, గజేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కిడ్నీ బాధిత రోగికి సంఘం పెద్దలు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

జూనియర్ లెక్చరర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: సర్కారు బడుల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్టీయూ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని చెప్పారు. చాలా కాలంగా ఉద్యోగోన్నతుల కోసం ఎదురు చూస్తున్న సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, రఘునాథరెడ్డి, గంటామోహన్, పురుషోత్తం, హేమచంద్ర, జిల్లా అధ్యక్షులు దేవరాజులురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, ఆర్థిక కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సమస్యల పరిష్కారానికి కృషి


వడ్డెర సంఘం నాయకులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. వడ్డెర సంఘం నాయకులు ఆదివారం విజయానందరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి మాట్లాడారు. బీసీలు వైఎస్సార్‌సీపీకి వెన్నెముకలాంటివారన్నారు. జగనన్న ప్రభుత్వంలో వారికి పలు పదవులు ఇచ్చి ప్రాధాన్యత కల్పించారని గుర్తుచేశారు. వడ్డెరలు ఐక్యంగా ఉండి జగనన్నను ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు రవీంద్ర రాజు, నాయకులు మురుగయ్య, దేవరాజు, సంఘం ఉపాధ్యక్షులు సెంథిల్‌కుమార్, జిల్లా కోశాధికారి సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యప్ప, జిల్లా ఉపాధ్యక్షులు గురప్ప, శేఖర్, జిల్లా యువత అధ్యక్షులు హరి పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందాం

- పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

కాణిపాకం(యాదమరి): రాబోవు ఎన్నికలలో మన జగనన్నను మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేయడమే మన అందరి లక్ష్యం అని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. కాణిపాకంలో ఆదివారం ప్రైవేటు కల్యాణ మండపంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి నూతనంగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ యువజన సంఘ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఇందులో డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ మనందరం కలసికట్టుగా ప్రతి గ్రామంలో ప్రతి గడపకూ వెళ్లాలని చెప్పారు. ప్రతి ఒక్కరితోనూ ఆప్యాయంగా మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన పథకాలను వారికి వివరించాలన్నారు. వచ్చే ఎన్నికలలో ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని విన్నవించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇప్పటి వరకు వస్తున్న ప్రభుత్వ పథకాలన్నీ కొనసాగుతాయని వివరించాలన్నారు. ఎవరైనా పథకాలు రాలేదని వివరిస్తే వెంటనే వలంటీర్ల సహాయంతో ఎందుకు వారికి పథకాలు రాలేదో వారికి వివరించాలని సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ని యూత్ వింగ్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ప్రజల్లోకి రాలేక భయపడుతున్నారు

టీడీపీ, జనసేన నాయకులు రాబోవు ఎన్నికల్లో ఎలాంటి హామీలు ఇవ్వాలో అర్థంగాక ప్రజల్లోకి రాలేకపోతున్నారని డాక్టర్ సునీల్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రం విడిపోయిన సమయంలో ఎన్నికలు రాగా చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడు అని ముఖ్యమంత్రిని చేస్తే గ్రాఫిక్స్ చూపించి, అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. దీన్ని గుర్తుపెట్టుకున్న ప్రజలు గత ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిని చేశారని గుర్తు చేశారు. కానీ టీడీపీ, జనసేన గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోవడంతో ప్రస్తుతం ప్రజల్లోకి రాలేక పోతున్నారన్నారు. ప్రజల్లోకి వచ్చి చెప్పినా ఎవ్వరు నమ్మే పరిస్థితుల్లో లేరని తెలిపారు.

ఎమ్మెల్యే గన్‌మన్ కుటుంబానికి పరామర్శ


కొంక మణ్ణెమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పూతలపట్టు: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వద్ద గన్‌మన్‌గా పనిచేస్తున్న చంద్ర తల్లి కొంక మణ్ణెమ్మ పదిరోజుల క్రితం మృతి చెందారు. మండలంలోని పోటుకనుమ గ్రామంలో ఆదివారం జరిగిన దశదిన కర్మక్రియలకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరై ఆమెకు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు.